సంపుటి - 6 ఆగస్టు-2023 సంచిక - 12

# జీవస్వరం

ఆధ్యాత్మిక మాస పత్రిక


తండ్రి గారి సందేశం......................................3

దయగల దేవుడు ......................................6

మహా శుక్రవారం ......................................8

పునీత బొనవెంతూర్ ......................................10

బైబిల్ దర్శనం......................................12

శుభవచనం బైబిల్ క్విజ్......................................15

ఇంద్రధనుస్సు......................................17


ఏంజెల్స్ కార్నర్......................................18

యువ స్పందన ......................................19

బైబిల్ దృశ్యమాలిక......................................21

శుభవచనం బైబిల్ క్విజ్ జవాబులు......................................23









**ముద్రణానుమతి**

**బిషప్ ప్రిన్స్ అంతోని గారు**

**ఆదిలాబాద్ గురుపీఠ మేత్రాణులు**

**సంపాదకవర్గం**

ఫాదర్ సిజో | ఫాదర్ ఎబిన్

Mr. M. సత్యం | సిస్టర్ క్రిస్టీన CMC

Mrs. K. శ్రీలత | Mr. J. లూర్దు స్వామి



**జీవస్వరం**
**బిషప్స్ హౌస్**
**మంచిర్యాల- 504 208**
**మంచిర్యాల జిల్లా**
**తెలంగాణ**


**Cell: 09398764408**

**Email ID - jeevaswarammagazineadb@gmail.com**

**Jeevaswaram**
**Bishop's House**
Mancherial - 504 208
Mancherial Dist
Telangana State

నీ ప్రేమను, విశ్వసనీయతను చూచి
నీ పవిత్ర మందిరమువైపు మరలి,
శిరము వంచి నీకు వందనములు అర్పింతును.
నీ నామమును, నీ ఆజ్ఞలును అన్నిటి
కంటెను ముఖ్యమైనవి

(మత్తయి 138, 2)



# తండ్రి గారి సందేశం....



## మన బలహీనతలో బలము మన దేవుడు

**క్రీస్తు నాథుని యందు ప్రియ సహోదరీ సహోదరులారా!**

**"నా కృప నీకు చాలును. బలహీనత యందు నా శక్తి పరిపూర్ణమగుచున్నది అని ఆయన నాతో చెప్పెను. కాగా క్రీస్తు శక్తి నా మీద నిలిచి ఉండు నిమిత్తము విశేషముగా నా బలహీనతలయందే నేను గర్వింతును. క్రీస్తు కొరకైన బలహీనతలు, అవమానములు, కష్టములు, హింసలు, బాధలు నాకు తృప్తినే కలిగించును. ఏలయన, నేను ఎప్పుడు బలహీనుడనో అప్పుడే బలవంతుడను" (2 కొరింతీ 12,9-10).**

ప్రియ సహోదరీ సహోదరులారా, పునీత పౌలు గారి ఈ మాటలు మనకు ఆశ్చర్యాన్ని కలిగించవచ్చు. కానీ, అది నిజం. పరిశుద్ధ గ్రంథం ప్రకారం, ప్రపంచంలోని శక్తివంతమైన వారి ద్వారా కాకుండా బలహీనమైన వారి ద్వారా దేవుడు తన కార్యమును జరిగిస్తాడు. పునీత పౌలు గారి మాటలు దీనిని ధృవీకరిస్తుంది. "వివేకవంతులను సిగ్గుపడునట్లు చేయుటకు, లోకముచే అవివేకులుగా భావింపబడు వారిని దేవుడు ఎన్నుకొనెను. శక్తిమంతులను సిగ్గుపడునట్లు చేయుటకు లోకముచే బలహీనులుగా భావింపబడు వారిని ఆయన ఎన్నిక చేసికొనెను. లోకముచే ముఖ్యమైనదిగ భావింపబడు దానిని నాశము చేయుటకు, లోకము అల్పముగ, నీచముగ, విలువలేనిదిగ ఎంచు దానిని ఆయన ఎన్నుకొనెను" (1 కొరింతీ 1,27-29).

అబ్రహాము వృద్ధుడైనప్పటికీ, అనేక జాతులకు తండ్రి అని పిలువబడ్డాడు. దేవుడు అతనిని బలపరచి జాతులకు తండ్రిగా చేసాడు. మోషే భయస్తుడు మరియు నత్తితో మాట్లాడేవాడు. అతను ఐగుప్తు నుండి పారిపోయాడు. అయినప్పటికీ ఫరోరాజు యొక్క శక్తివంతమైన చేతి నుండి యిస్రాయేలీయులను విడిపించడానికి దేవుడు అతనిని ఉపయోగించాడు. నిబంధన మందసమును మోస్తున్న యాజకులు మరియు బాకాలు ఊదడం ద్వారా యెహోషువ యెరికో గోడలను కూల్చాడు. చిన్న వాడైన దావీదు కేవలం ఒడిసెలతో గొల్యాతును ఓడించాడు.

శపింపబడినది అని అందరు అనుకునే సిలువ మరణం ద్వారా యేసు క్రీస్తు ప్రపంచాన్ని, పాపాన్ని, మరణాన్ని మరియు సాతానును జయించాడు. బాలుడైన యేసు శరణార్థిగా జీవించాడు. పుట్టుక నుండి మరణం వరకు, ఆ కాలంలోని పేదలు మరియు నిస్సహాయులలో ఒకడిగా జీవించాడు. నేరస్థునిగా పరిగణింపబడి సిలువ వేయబడ్డాడు. అతను సిలువలో శ్రమలను అనుభవిస్తూ: "'ఏలీ, ఏలీ, లామా సబక్తాని' అని యేసు బిగ్గరగా కేక పెట్టెను. 'నా దేవా!

నా దేవా! నీవు నన్నేల విడనాడితివి? అని దీని అర్థము" (మత్తయి 27,46). సిలువ కింద నిలబడిన వారు క్రిందికి దిగి రమ్మని యేసు ప్రభువుకు వారు సవాలు విసిరారు. ప్రజలు యేసు ప్రభుని బలం మరియు శక్తి ప్రదర్శనలను ఆశిస్తున్నారు. కానీ తన శక్తిని నిరూపించుకోవడానికి దేవుడు అలాంటి సవాళ్లకు స్పందించడు. అతని మార్గాలు అసమంజసంగా కనిపిస్తాయి కానీ ఇది నిజం.

జీవితంలో శక్తిని, బలాన్ని చూపించాలనుకునే వారికి లేదా ఆశించే వారికి దేవుని కుమారుడైన యేసు ప్రభు జీవితం పూర్తి వైఫల్యం మరియు ఓటమి అని అనిపించవచ్చు. కానీ యేసు తన జీవితాన్ని తండ్రి చేతికి అప్పగించాడు. సమాధి నుండి తన కుమారుని తిరిగి లేపడం ద్వారా దేవుడు తన శక్తిని చూపించాడు. యేసు ప్రభు మరణించి తిరిగి లేచుట ద్వారా చెడు మరియు మరణపు శక్తిని ఓడించాడు. మన బలహీనతలో తన కార్యమును జరిగించగల దేవునిపై పునీత పౌలు నమ్మకాన్ని ఉంచాడు. యేసు ప్రభు బలహీనుడైన తన ద్వారా తన కార్యమును జరిగించగలడని అతను నమ్మాడు.

యేసు ప్రభు తన పనిని నిర్వహించడానికి మత్స్యకారులైన అపోస్తలులను మరియు స్త్రీలను ఎన్నుకున్నాడు. తన సువార్త ప్రకటనను కొనసాగించడానికి శక్తివంతులను, బలవంతులను, సమాజంలో గొప్పవారిని, ధనికులను యేసు ప్రభు పిలవలేదు. వినయపూర్వకమైన మరియు సామాన్య ప్రజల ద్వారా దేవుడు తన కార్యమును జరిగిస్తాడు. దేవుడు ఎల్లప్పుడు పని చేసే మార్గమే ఇది. బలహీనులు దేవుని చేతిలో బలవంతులవుతారు. "నా కృప నీకు చాలును. బలహీనత యందు నా శక్తి పరిపూర్ణమగుచున్నది అని ఆయన నాతో చెప్పెను. కాగా క్రీస్తు శక్తి నా మీద నిలిచి ఉండు నిమిత్తము విశేషముగా నా బలహీనతలయందే నేను గర్వింతును" (2 కొరింతీ 12,9).

పరిస్థితులు భయానకంగా అనిపించినప్పటికీ, బలహీనులు దేవుని దయతో బలవంతులుగా మరియు శక్తివంతులుగా మారుతారు. అధికారులకు భయపడి దాగుకున్న అపోస్తలులు పరిశుద్ధాత్మ దిగివచ్చిన తర్వాత బలవంతులుగా మారారు. బలహీనులైన మత్స్యకారులు ఆనాటి అధికారులకు వ్యతిరేకంగా గళం విప్పారు, సువార్తను ప్రకటించారు. "చదువు రాని ఈ సాధారణ మనుష్యులగు పేతురు, యోహానులు అంత ధైర్యముగా సమాధాన మిచ్చుటచే ఆ సభా సభ్యులు ఆశ్చర్యపడిరి. వారిద్దరు నిజముగా యేసు సహచరులై ఉండిరని అప్పుడు వారు గ్రహించిరి" (అ.కా. 4,13). సువార్తను ప్రకటించుటకు పేతురు, యోహానులు ధైర్యంగా ఆనాటి శక్తిమంతులను ఎదుర్కొన్నారు. "కనుక వారు వారిని లోనికి పిలిపించి, యేసు పేరిట వారు ఎంత మాత్రము మాట్లాడరాదనియు, బోధింపరాదనియు ఆజ్ఞాపించిరి. 'మేము మీ మాటలను పాటింపవలయునా? లేక దేవుని మాట పాటింపవలయునా? దేవుని దృష్టిలో ఏది సమంజసమో మీరే నిర్ణయింపుడు. ఏలయన, మేము కన్నులారా చూచినదానిని గూర్చి, చెవులారా విన్న దాని గూర్చి మాట్లాడకుండ ఉండలేము' అని పేతురు, యోహానులు వారికి బదులిచ్చారు." (అ.కా. 4,18-20).

నా ప్రియమైన సహోదరి సహోదరులారా, ప్రపంచమంతటా దేవుని వాక్యాన్ని బోధించడానికి మనం భయపడాల్సిన అవసరం లేదు. మనం బలహీనులమైనప్పటికీ, తనను ఎరుగని వారందరికి తన సాక్షులుగా ఉండేందుకు దేవుడు మనలను ఎన్నుకున్నాడు. శ్రమలకు, వేధింపులకు మనం భయపడకూడదు. ఈ విషయంలో తొలి క్రైస్తవులు మనకు ఉత్తమ ఉదాహరణలు. "పిమ్మట వారు అపోస్తలులను లోనికి పిలిపించి కొరడాతో కొట్టించి, మరల యేసు పేరిట బోధింపరాదని ఆజ్ఞాపించి వదలి వేసిరి. యేసు నామము కొరకు అవమానములు పొంద యోగ్యులమైతిమి అని వారు సంతోషముతో ఆ విచారణ సభ నుండి వెడలి పోయిరి" (అపోస్తలుల కార్యములు 5, 40-41). మనల్ని మనం దేవుని చేతుల్లోకి అప్పగించుకుని, అందరికి ఆయన సువార్తను లోకమంతటా ప్రకటిద్దాం. మన బలహీనతలను బలముగా మార్చు దేవుని నమ్మి ముందుకు సాగుదాం. మనం ఎవరికి భయపడనవసరం లేదు. మనలను కంటికి రెప్ప వలె కాపాడు వాడు మన దేవుడు. "దేవుడు మన పక్షమున ఉన్నచో ఇక మనకు విరోధి ఎవడు?" (రోమీ 8,31).

**జీవము గలిగిన సజీవ దేవుని జీవస్వరం**
**మనలనందరిని జీవింపజేయును గాక. ఆమెన్.**

క్రీస్తు నందు మీ తండ్రి
**బిషప్ ప్రిన్స్ అంతోని**
ఆదిలాబాద్ గురుపీఠ మేత్రాణులు

**దేవా!**
**నీవు మంచివాడవు**
**ప్రేమామయుడవు గనుక**
**నాకు ప్రత్యుత్తర మిమ్ము.**
**మిగుల జాలికలవాడవు**
**కనుక నా మొర వినుము.**
**ఈ దాసుని నుండి**
**నీ మొగమును మరుగు**
**చేసికొనకుము.**
**నేను ఆపదలో చిక్కితిని**
**కనుక శీఘ్రమే నాకు**
**ఉత్తరమిమ్ము**
(కీర్తన 69,17-18)



# దయగల దేవుడు

1. "ధైర్యవంతులమై మనము దయానిధియగు దేవుని సింహాసనమును సమీపింతము. అచట మనము కృపను పొంది అవసరమునకు ఆదుకొనగల అనుగ్రహమును కనుగొందుము" (హెబ్రీ 4,16)

2. "ప్రభూ! నీవు మంచి వాడవు, నరుల తప్పులను మన్నించు వాడవు. నీకు మనవి చేయు వారిని మిక్కిలి నెనరుతో ఆదరించువాడవు" (కీర్తన 86,5).

3. "మీ తండ్రి వలె మీరును కనికరము గలవారై యుండుడు" (లూకా 6,36).

4. "దేవుని ఎదుట మన పాపములను ఒప్పుకొనినచో, ఆయన మన పాపములను క్షమించి, మన అవినీతి నుండి మనలను శుద్ధిచేసి, నీతిని చేకూర్చును, ఏలయన ఆయన విశ్వసనీయుడు, నీతిమంతుడు"

(యోహాను 1,9)

5. "మన ప్రభువగు యేసు క్రీస్తు తండ్రియైన దేవుడు స్తుతింప బడునుగాక! మృతులలో నుండి యేసు క్రీస్తును ఆయన పునరుత్థానమొనరించి, దాని మూలమున మనకు నూత్న జీవమును ప్రసాదించెను. విశిష్టమగు ఆయన కనికరమే దీనికి కారణము. ఇది మనలను సజీవమగు నిరీక్షణతో నింపును" (1 పేతురు 1,3).

6. "క్రీస్తు నాపై సంపూర్ణ సహనమును, కనికరమును చూపెను. ఇక ముందు నిత్యజీవము పొందుటకై ఆయనను విశ్వసింప వలసిన వారందరికి నేను ఆదర్శ ప్రాయుడనుగా ఉండుటకే ప్రధాన పాపినైన నా యందు ఆయన ఇట్లు చేసెను" (1 తిమోతీ 1,16).

7. "కొందరు భావించునట్లు ప్రభువు తన వాగ్దానమును నెరవేర్చుట యందు ఆలస్యము చేయడు. అంతేకాక మీతో ఎంతయో ఓపికగా ఉండును. ఏలయన, ఎవరును

నాశనము కావలెనని ఆయన కోరడు. కాని అందరును పాపము నుండి విముఖులు కావలెననియే ఆయన వాంఛ" (2 పేతురు 3,9).

8. "నన్ను ఇరుకున బెట్టితివి. కాని నరుని చేతికి చిక్కుటకంటె యావే చేతికి చిక్కుట మేలు. ప్రభువు మిక్కిలి దయాపరుడు అని పల్కి అంటురోగమునే యెన్నుకొనెను. అది పంట కాలము. ప్రభువు నాటి ప్రొద్దుటి నుండి నియమిత కాలము ముగియు వరకు అంటురోగము పంపెను. దాను నుండి బేర్షెబా వరకు డెబ్బది వేల మంది చచ్చిరి'' (2 సమూవేలు 24,14-15).

9. "మేము నీపై తిరుగబడినను, నీవు మాపై దయ చూపి మమ్ము రక్షింపగోరితివి" (దానియేలు 9,9).

10. "మీ ప్రభువైన దేవుడు దయామయుడు. కాబట్టి మిమ్ము చేయి విడువడు, నాశము చేయడు. మీ పితరులతో చేసికొనిన నిబంధనను విస్మరింపడు" (ద్వితీ 4,31) .

11. "దేవుని కృప అపారము. మనపట్ల ఆయన ప్రేమ అమితము" (ఎఫెసీ 2,4).

12. "నీవు వెళ్లి ఉత్తర దిక్కుననున్న యిస్రాయేలుకు ఇట్లు బోధింపుము. విశ్వాసఘాతకురాలవైన యిస్రాయేలూ! నీవు నా చెంతకు మరలిరమ్ము. నేను కరుణాళుడను. కనుక నీపై ఇక కోపింపను" (యిర్మీయా 3,12).

13. "యాజకులారా! గోనె తాల్చి విలపింపుడు. బలిపీఠములపై అర్చన చేయువారలారా! శోకింపుడు. దేవాలయములోనికి పోయి రేయెల్ల ఏడ్వుడు. దేవాలయమున మీ దేవునికి అర్పించుటకు ధాన్యము గాని, ద్రాక్షా సారాయము గాని లేదు" (యోవేలు 2,13).

14. ''ప్రభూ! నీ వంటి దైవము లేడు. నీవు ప్రాణములతో మిగిలియున్న నీ ప్రజల తప్పులు మన్నింతువు. మా మీద సదా కోపింపవు. మమ్ముల కరుణించుటయే నీకానందము" (మీకా 7,18).

15. యావే సులభముగా కోపపడువాడు కాదు. మిగుల దయగలవాడు. అతడు ప్రజల పాపములను తిరుగుబాటును మన్నించును. అయినను ఆయన అపరాధిని విడిచిపెట్టడు. పితరుల పాపముకై వారి సంతానమును మూడు నాల్గు తరముల వరకు శిక్షించును - అని నీవే స్వయముగా చేసిన ప్రమాణమును జ్ఞప్తికి తెచ్చుకొనుము" (సంఖ్యా 14,18).

16. "ఆయన అందరికి మేలు చేయును. తాను కలిగించిన ప్రాణి కోటిని అంతటిని నెనరుతో చూచును" (కీర్తన 145,9).

17. ఏలయన, "నాకు దయ కలిగిన వానిపై దయ చూపుదును, నాకు జాలి కలిగిన వానిపై జాలి వహింతును" (రోమీ 9,15).




# మహా శుక్రవారం

**(గత సంచిక తరువాయి భాగం)**

సిలువ కేవలం దేవుని యొక్క మహా ప్రేమకు పరాకాష్ట కాదు. అది దేవుని పరిశుద్ధతకు, నీతికి కూడా పరాకాష్ట. చాలా మంది ఏమనుకుంటారంటే ప్రాయశ్చిత్తం లేకుండా దేవుడు క్షమించ లేడా అని. నిజంగానే అన్యులు క్షమించలేరు. ఎందుకంటే వారి దగ్గర సిలువ లేదు. సిలువ విలువ వారికి తెలియదు. వారి మతాల్లో ప్రాయశ్చిత్తం లేదు. మనం క్షమించ గలం, ఎందుకంటే మన దగ్గర సిలువ వుంది. మనం క్షమను పొందిన వాళ్ళం, దాన్ని ఆస్వాదించిన వాళ్ళం. మన దేవుడు సిలువ అనేది లేకుండా పాపాన్ని క్షమించలేడు. ఎంతగా ఆయన పాపాన్ని ద్వేషిస్తాడు, అసహ్యించు కుంటాడంటే, ఎంత నీతిమంతుడు, ఎంత పరిశుద్ధుడంటే తన కుమారుడినైనా సిలువకెక్కించడానికి సిద్ధపడ్డాడంటే పాపాన్ని శిక్షించకుండా ఉండలేని ఆయన నీతి! ఆయన ప్రేమను మనకిచ్చాడు, ఆయన నీతిని క్రీస్తు సిలువలో సంతృప్తిపరిచాడు. అందుకనే ఆయన మహా సిలువ త్యాగంలో కేవలం ఆయన ప్రేమ మాత్రమే ఆవిష్కరించబడలేదు, ఆయన మహా పరిశుద్ధత ఆయన నీతి ఆవిష్కరించబడింది. ఈనాటి యువత ఒకటి గమనించాలి, సిలువను చులకన చేయకండి. సిలువ సూక్తిని ఇంకొకటి మనం అర్థం చేసుకోవాలి. పాపం చాలా ఖరీదైనది. దేవుడు ప్రాణం పెట్టవలసినంతగా ఖరీదైనది. మనందరి పాపాల కోసం ఆయన

సిలువలో ప్రాణం పెట్టవలసి వచ్చింది. అలాంటి దేవుడు మనం పాపం చేస్తూ ఉంటే, మన సిలువను చూసి ఆయన ప్రేమకు ఎంత ఆకర్షితులౌతారో, ఆయన పరిశుద్ధతకు అంత భయపడాలి. అందుకనే ప్రతీ క్రైస్తవుడు, క్రైస్తవురాలు యేసు క్రీస్తు సిలువను వెనక్కు చూస్తూ, ఎందుకంటే రెండువేల సంవత్సరాల క్రితం ఆయన చనిపోయిన ఆ సిలువ త్యాగాన్ని బట్టే మీరున్నారు, నేనున్నాను. మనకంటూ ఇంకేం లేదు. ఒకవేళ క్రైస్తవ్యాన్ని మనం అర్థం చేసుకోవాలంటే క్రైస్తవ్యంలోని ప్రేమ, క్రైస్తవ్యంలో ఉన్నటువంటి క్షమాగుణం, త్యాగం, నిస్వార్థత ఇవన్నీ సిలువ పాదాల వద్దే నేర్చుకోవాలి.

యేసు క్రీస్తు సిలువ రక్తం మనల్ని కడగడమే కాదు, యేసు క్రీస్తు సిలువ యొక్క లక్ష్యం ఏమిటంటే పాపము యొక్క శిక్ష నుండి విడిపించడమే కాదు, క్రీస్తులాగ మనల్ని మార్చడం. సిలువలో మనం మళ్ళీ పుట్టాం. సిలువ వేయబడిన క్రీస్తు యొక్క తత్వాన్ని పుణికి పుచ్చుకుంటాం మనం. అందుకే సిలువతో మనం బ్రతకాలి! దేవుడు మనందరిని దీవించునుగాక.

లూర్థుస్వామి,
బెల్లంపల్లి





# పునీత బొనవెంతూర్

**(ఫ్రాన్సీసు అస్సిసీ వారి సభ గురువు, బిషప్ మరియు కార్డినల్, వేదాంతశాస్త్రి క్రీ॥శ॥ 1221 - 1274)**

**గత సంచిక తరువాయి భాగం**

క్రీ॥శ॥ 1265లో యార్కు పీఠంకు బిషప్పుగా ఎన్నుకుంటానని పరిశుద్ధ పోపుగారు బొనవెంతూర్ గారికి కోరగా, వారు ఆ గొప్ప పరిశుద్ధ అంతస్తుకు తగనని శ్రీవారి పాదాలపై బడి మిక్కిలిగా కన్నీరు కార్చారు. అప్పుడు పోపుగారు తమ నిర్ణయాన్ని నిలుపుదల చేసుకున్నారు. మరో ఎనిమిది సం॥లు గడిచాక 10వ గ్రెగొరి పోపుగారు బొనవెంతూర్ గారిని అల్బనో పీఠంకు మేత్రానులుగా కార్డినలుగా ఎంపిక చేసికొని వారిని ఆజ్ఞాపించారు.

కనుక శ్రీవారి ఆజ్ఞకావడాన తిస్కరింపజాలక శిరం వంచారు. కార్డినల్ టోపీని పోపుగారి అధికార వార్తాహరుడు ఫ్లోరెన్స్ నగరంలోని వారి మఠాశ్రమంకు తీసికొని రాగా ఆ సమయంలో బొనవెంతూరు గారు ఎంగిలి పళ్లాలు, గ్లాసులు దేక్షాలు కడుగుతుండటం చూసి నివ్వెరపోయాడు. తన పనిముగిసే వరకు ఆ టోపీని అభినందించకుండా ఉండ లేకపోయారు. క్రీ॥శ॥ 1273లో నూతన పోపు ఎన్నికలో నిర్వాహకుడుగా ఉన్నారు.

10వ గ్రెగోరి జగద్గురువులు 1274లో లియోన్స్ పట్టణంలో 14వ ప్రపంచ క్రైస్తవ మహాసభలు నిర్వహింపతలచారు. స్వయంగా తాము అందుపాల్గొననున్నారు. ఈ సభలో చర్చించాల్సిన అంశాలను, నిర్వహణా తీరును బొనవెంతూరు గారిని తయారు చేయాల్సిందిగా కోరబడ్డారు. ఈ పనంతా బొనవెంతూరు గారు దిగ్విజయంగా నెరవేర్చారు. కాని సమావేశం ముగియకముందే క్రీ॥శ॥ 1274 జూలై 14వ తేదీన స్వర్గస్తులయ్యారు. గ్రీకు క్రైస్తవులను శ్రీసభలో ఐక్యం చేయడానికి ఎంతో ప్రయాసపడ్డారు. ఆ సంఘం బలపడుతున్న రోజుల్లో బొనవెంతూరు గారు వ్యాధికి గురియై లియోన్స్ పట్టణ సభలో పాల్గొని అక్కడే పోపుగారి హస్తాల మీదుగా అవస్థాభ్యాంగాన్ని, దివ్యసత్ప్రసాదాన్ని లోకొని పరమపదించడం ఎంత అదృష్టం.

వేదాంత పండితులైన పునీత బొనవెంతూర్ గారు గొప్ప సాధుస్వభావం కలవారు. భక్తి తత్పరులు. వారి నోటిమాటలు హృదయాన్ని హత్తుకొని భక్తిని విశ్వాసాన్ని బలపరుస్తాయి. త్రియేక దేవుని పరమ రహస్యం విషయంలో వారు పునీత బెర్నార్డు గారితో

సమానం. అందుకే 13వ లియో (సింహరాయులు) పోపుగారు వారి గూర్చి "దేవ రహస్యాల యువరాజు. పరమ రహస్యములు – సిద్ధాంతములు– భావార్థములు విప్పి చేయడంలో వారికి వారే సాటి. ఈ ముప్పేట సంగ్రహరచనలో వారి పాండిత్యం అమోఘం. పాఠశాల పిల్లలకు అర్థమయ్యేలా పూర్తి వేదాంత శాస్త్రాన్ని 4వేల పేజీల్లో సంక్షిప్తంగా తమ 27వ ఏటనే వ్రాసిన ఘనుడు. వారి 'దైవార్చన ధ్యానగ్రంథము' క్రైస్తవ సిద్ధాంత సంగ్రహదర్పణము. వారు రూపొందించిన "పునీత ఫ్రాన్సీసు అస్సిసీ వారి జీవిత చరిత్ర" క్రీ॥శ॥ 1263లో ఇతరులు వ్రాసిన ఫ్రాన్సీసు వారి చరిత్రల కంటే ప్రామాణికమైనదిగా గుర్తింపబడింది" అని గొప్పగా కీర్తించారు. పునీత బొనవెంతూర్ గారు తమ బోధనాంశాలకు ఎంతో ప్రాముఖ్యత నిచ్చేవారు. అవి తమ సభ గురువులు, ఇతరు క్రైస్తవ మతాచార్యులు, సామాన్య ప్రజలు, పోపుగార్లు, రాజులు అందరికి దేవుని వాక్యామృతంగా తోచేటట్లు చెప్పకలిగి గొప్ప ఖ్యాతిగడించారు. బొనవెంచర్ అనగా అదృష్టం అని అర్థం.

**ధ్యానాంశం**

**మతానురక్తుని అత్యుత్తమ పరిపూర్ణత, సాధారణ పనులను సక్రమంగా సంపూర్ణంగా నెరవేర్చడంవల్ల లభిస్తుంది. (పునీత బొనవెంతూర్)**

**ప్రభూ! నా ప్రార్థన వినుము. నా మొరను ఆలింపుము.**
**నా కన్నీటిని అనాదరము చేయకుము.**
**నేను నీకు అనతికాల అతిథి వంటి వాడను,**
**మా పూర్వులందరి వలెనే నేనును స్థిర**
**నివాసములేని పరదేశిని. (కీర్తన 39,12)**




**(గత సంచిక తరువాయి భాగం)**

శ్రమలు, మరణ పునరుత్థానముల తర్వాత తనకు రానున్న వైభవమును, మహిమను ఉన్నత పర్వతంపై దివ్యరూపధారణ ద్వారా తెలియజేశాడు. ఏలియా, మోషేలు ఆయనతో సంభాషించారు. ఈ ఏలియా, మోషేలు సీనాయి పర్వతంపై దైవదర్శనం గాంచారు (1రాజులు 19,9-12; నిర్గమ 19,16-25). వీరిరువురు కూడ ఇస్రాయేలీయులలో గొప్ప ప్రవక్తలు. ఇరువురు కూడా బాధలనుభవించినవారే. అంతిమ జీవిత దశలో ఇరువురు కూడా శరీరములతో పరలోకమునకు తీసుకుపోబడ్డారన నమ్మకం కలదు (2 రాజులు 2,11-12; ద్వితీ 34,5-6). పేతురు దర్శనం తర్వాత యేసును కూడా ఏలియా, మోషేతో సమాంతరంగా భావిస్తూ మూడు పర్ణశాలలు నిర్మిస్తానన్నాడు. కాని యేసు దేవుని కుమారుడు, ఏలియా, మోషేల కంటే అధికుడు. అందువలననే దేవుని ఉనికిని చాటు మేఘం (నిర్గమ 13,21; 19,9; 33,9) వారిని ఆవరించింది. ఆ మేఘం నుండి యేసు తన 'ప్రియమైన కుమారుడని' పేతురు, యాకోబు, యోహానులకు తెలియజేసింది. మోషే ఇస్రాయేలుకు రానున్న గొప్ప ప్రవక్త మాటను ఆలకించమని (ద్వితీ 18,15) చెప్పినట్టే స్వర్గం కూడా ముగ్గురు శిష్యులకు ఏ మాత్రం సందేహం లేకుండా యేసును ఆలకించమని చెప్పింది. యేసు నుండి శ్రమలు, సిలువ సందేశం స్వీకరించటానికి కష్టముగా నున్నవారికి ఈ స్వరం చాలా ముఖ్యం. యేసు ఇరువురితో సంభాషించటం, ప్రవచనముల, ధర్మశాస్త్రమును ఇచ్చిన వానిగా మోషే

చిత్రింపబడ్డారు. పర్వతం దిగివస్తున్నపుడు మెస్సయా రాకముందు ఏలీయా ప్రవక్త రాకను గూర్చి ప్రశ్నించినపుడు, యేసు ఏలీయా ముందుగానే వచ్చాడన్నాడు. ఆ వచ్చిన ఏలీయానే బప్తిస్మ యోహాను. ఏలీయాకు జరిగినట్లే క్రీస్తుకు కూడా జరుగుతుందని వారు తలస్తుంటే, బప్తిస్మ యోహాను తిరస్కరింపబడి, అవమానములు పొంది, హేరోదు రాజు వలన శిరచ్ఛేధం గావింపబడి, బాధమయ మరణం పొందినట్లే తాను కూడా శ్రమలు, సిలువ మరణం పొందనున్నాడని యేసు సూచించాడు. అయితే పునరుత్థానం కూడా తథ్యమేనన్నాడు. ఆ పునరుత్థాన మహిమను ముందుగా చూపి రానన్ను శ్రమలు, సిలువ మరణ కాలంలో శిష్యులను ధైర్యంగా ఉంచుటకే, యేసు ఈ దివ్యరూప ధారణను వారికి తెలియజేశాడు, కళ్ళారా చూపాడు. మనం కూడా బాధలలో, కష్టములలో కృంగిపోకుండ యేసు నందు విశ్వాసంతో ధైర్యముగా ఉండాలి.

**6.4 పిశాచగ్రస్తునికి స్వస్థత 9:14–28**

ఈ అద్భుత క్రియను వివరముగా వర్ణించుట ద్వారా మార్కు తన చదువరులకు, మనకు తెలియజేస్తున్న విషయము: “విశ్వసించువానికి అంతయు సాధ్యమే (23వ వచనం), ఈ విశ్వాసం ప్రార్థన ద్వారా మాత్రమే బలపడగలదు (29వ వచనం), పిశాచగ్రస్తుని యేసు స్వస్థపరచుటలో మనకు ఆ బాలుని తండ్రి విశ్వాసము ఆదర్శంగా నిలుస్తుంది. విశ్వాసం, ప్రార్థన కూడా నిరుపయోగంగా కనబడుతూ, నిరాశ, నిస్పృహలకు లోనైన సమయాల్లో బాలుని తండ్రివలె మనం ప్రార్థించాలి: “నేను నమ్ముచున్నాను. నాకు అవిశ్వాసం లేకుండునట్లు తోడ్పడుము” (24 వచనం). ఈ బాలుని తండ్రి విశ్వాసం, బాలుని నుండి మూగ దయ్యమును పారద్రోలలేని శిష్యులు అవిశ్వాసంకు సవాలుగా నిలుస్తుంది. మనము విశ్వాసం ఉందనుకోగానే సరిపోదు, ఆ విశ్వాసమందు ఎదుగుటకు ప్రార్థన చేస్తుండాలి. అపుడే మనం దుష్టశక్తులకు, సాతాను తలంపులకు, ప్రయత్నాలకు ఎదురునిలచి దేవుని శక్తి కనపరచగలం.

**6.5. రెండవసారి యేసు మరణ పునరుత్థానముల ప్రస్తావన 9:30–32**

యేసు రెండవసారి తన శ్రమల మరణ పునరుత్థానముల గూర్చి ప్రవచించాడు. అవిశ్వాసం వలన (9,19) ప్రార్థన లేకపోవుట వలన (9,29) బాలుని నుండి దయ్యమును పారద్రోలలేని శిష్యులు ఈ రెండవసారి శ్రమల పునరుత్థానముల ప్రవచనం కూడా గ్రహించలేకపోవటం ఆశ్చర్యమేమి కాదు. దీనిలోని గుడార్థమును గ్రహించలేకపోవుట వలననే భయపడి యేసు శ్రమల, మరణ సమయంలో వారు యేసును విడిచి పారిపోయారు.

**6.6 శిష్యుల లక్షణాలు 9:33–50**

మొదటిసారి శ్రమల పునరుత్థానముల ప్రస్తావన తదుపరి శిష్యుల లక్షణాలను తెలియజేసిన విధముననే (8,31–9,1) రెండవసారి ప్రవచనం తర్వాత కూడా యేసు శిష్యుల లక్షణాలను వివరించాడు.



# "పిల్లలూ! యేసయ్య మిమ్ములను పిలుస్తున్నాడు"

**ప్రియమైన చిన్నారులారా...!**

"ప్రభుపైన మనస్సును లగ్నం చేయాలి, కాని లోక విషయాలపై కాదు"

"మనం మన రక్షకుడైన ప్రభు యేసును ఈ లోకంలోని విషయాలన్నిటి కంటె సర్వోన్నతంగా చూడాలి". మనం క్రీస్తుతో పాటు సజీవులుగా లేవనెత్తబడితిమి. కనుక పరలోకమందలి వస్తువుల కొరకు మనం కాంక్షించాలి. పునీత యోహాను గారు వ్రాసిన శుభ వార్తలో ప్రభువు శిష్యులమైన మనం ఈ లోకం పట్ల ఎలా ఉండాలనే విషయమై ప్రభువు మాటలు చాలా స్పష్టంగా ఉన్నాయి. "కాని లోకము వారిని ద్వేషించిననది. ఏలయన, నా వలె వారు లోకమునకు చెందిన వారు కారు. వారిని లోకము నుండి తీసికొని పొమ్మని నిన్ను ప్రార్థించుటలేదు. కాని దుష్టుని నుండి కాపాడుమని ప్రార్థించుచున్నాను (యోహాను 17,14-16).

సాతానుని హస్తాలలో చిక్కుకొని ఉన్నందున మనకు రక్షణ అవసరం. ఈ లోకంలో ఉన్నప్పుడే మనం సాతాను మరియు దుష్ట శక్తుల ప్రభావము నుండి మనలను మనం రక్షించుకోవాలి. ఇది ఇబ్బందికరమే కాని, అసాధ్యం మాత్రం కాదు. కాబట్టి మనం చెడు క్రియలు మరియు పాపపు మాలిన్య క్రియలకు లోనుకాకుండా ఈ లోకంలో జీవించటం సాధ్యమే. ఈ లోకంలో మన ప్రభువు ఏ విధంగా పవిత్ర జీవితాన్ని జీవించారో, అదేవిధంగా మనం కూడా "దుష్టస్వభావము" నుండి విముక్తి పొంది లోకంలోని వారివలె కాక ప్రభువువలె జీవించాలి.

# శుభవచనం బైబిల్ క్విజ్

**మార్కు సువార్త 1-16 అధ్యాయాలు**

పేరు ............................ఇంటి పేరు.........................విచారణ ..............................

## I. క్రింది ప్రశ్నలకు జవాబులు వ్రాయండి

ఫోన్ నెంబర్..................................

1) మీరు ప్రపంచమందంతట తిరిగి, ............................................ జనులకు సువార్తను బోధింపుడు.

2) అందు మనకు ............................................................ సిద్ధపరపుడు.

3) నిన్ను నీవు ప్రేమించుకొనునట్లు నీ .................................................. వానిని ప్రేమింపుము.

4) తల్లిదండ్రులను ........................................................... అనెను.

5) కడపటి వారు అనేకులు .......................................................... అగుదురు అనెను.

6) ఆకాశమువైపు కన్నులెత్తి, నిట్టూర్చి ...................... అనెను. అనగా ......................... అని అర్థము.

7) అపుడు ఒక ................................................................... వారిని ఆవరించెను.

8) ఆయనను అప్పగించిన ........................................................................... .

9) భుజించిన వారు ....................................................................... మంది పురుషులు.

10) నీవు వెళ్లుము నీ ........................................................ నీకు స్వస్థత చేకూర్చినది.

11) అయినను తుది వరకు నిలిచిన వాడే ................................................... .

12) ................................... గతించిపోవును గాని నా ................................ గతించిపోవు.

13) పిలాతు ........................................... చూచి నీపై వీరు ఎన్ని నేరములు మోపుచున్నారో చూడుము.

14) యూదుల రాజా! .......................................................... అని ఆయనకు నమస్కరింపసాగిరి.

15) సిలువ వేయబడిన ......................................, ................................ మీరు వెదకుచున్నారు.

16) ఉదయము ..................................................... గంటలకు ఆయనను సిలువపైకి ఎక్కించిరి.

17) అచట ......................................... నీటిని తీసికొని వచ్చు ఒక మనుష్యుడు మీకు ఎదురుపడును.

18) అప్పుడు ఒక పేద విధవరాలు వచ్చి, ........................................ నాణెములను మాత్రమే వేసెను.

19) అంతట వారు ....................................................................... గ్రామము చేరిరి.

20) ............................................................... సమాధానముతో పొయిరమ్ము అని పలికెను.

21) విత్తువాడు ............................................................... అను విత్తనమును విత్తుచున్నాడు.

22) ........................................................... పావురము రూపమున తనపై దిగివచ్చుట చూచెను.

23) నా కంటె ................................................................... నా వెనుక రానున్నాడు.

24) నీ ........................................................................... క్షమింపబడినవి అనెను.

25) మీరు ఏ ...................................కొలుతురో ఆ ............................... మీకును కొలువబడును.

**శుభవచనం బైబిల్ క్విజ్ జవాబు పత్రాన్ని విచారణ గురువుల ద్వారా గానీ, పోస్టు రూపంలో గానీ ఆగస్టు నెల 25వ తేదీలోపు మాకు పంపించాలి.**

**వచ్చే నెల పాఠ్యాంశం: లూకా సువార్త 1-12 అధ్యాయాలు**

# ఇంద్రధనుస్సు

"ఓ యేసు ప్రభువా! మమ్ము కనికరింపుము" అని కేకలు పెట్టిరి. యేసు వారిని చూచి 'మీరు వెళ్లి యాజకులకు కనిపింపుడు' అని చెప్పెను. వారు మార్గ మధ్యముననే శుద్ధి పొందిరి. అపుడు వారిలో ఒకడు తాను స్వస్థుడగుట గమనించి, ఎలుగెత్తి దేవుని స్తుతించుచు తిరిగి వచ్చి యేసు పాదముల వద్ద సాగిలపడి కృతజ్ఞత తెలిపెను. అతడు సమరీయుడు" (లూకా 17,13-16). ఈ చిత్రాన్ని రంగులమయం చేద్దాం.



**పేరు:..................................వయస్సు.......తరగతి.......స్థలం....................**

**సూచన :**

1. కేవలం 15 సం॥ల లోపు పిల్లలే ఈ పోటీలో పాల్గొనాలి.
2. రంగులు నింపిన చిత్రాన్ని మీ విచారణ గురువుల ద్వారా గానీ, పోస్టు రూపంలోగానీ ఆగస్టు నెల 25 తేదీలోపు మాకు పంపించాలి.



# దైవవాక్కు పఠించండి – పాటించండి

ఒకానొక పట్టణంలోని ఒక చర్చిలో చాలా కుటుంబాలు ఉన్నాయి. అందులో నుండి రెండు కుటుంబాల గూర్చి తెలుపాలని ఆశగా ఉంది. ఒక కుటుంబ యజమాని పేరు సామ్‌సన్. మరొక కుటుంబ యజమాని జాన్సన్. ఇరువురూ మంచి మిత్రులే. ఆదివారము తప్పకుండా మందిరానికి వెళ్తారు. వాక్యం వింటారు. సామ్‌సన్ భక్తిపరుడు. బైబిల్‌లోని ప్రవచనాలను శ్రద్ధగా చదువుతాడు. ఫాదర్‌గారు ఫలానా వాక్యం 'చదవండి' అని చెపుతే క్షణాల్లో పేజీలు తిప్పి వచనాలను పఠింటే ప్రజ్ఞ గలవాడు.

జాన్సన్ కూడా భక్తి పరుడే. వాక్యాన్ని శ్రద్ధగా చదువుతాడు, ధ్యానిస్తాడు. మంచి క్రైస్తవ జీవితానికి ఆదర్శంగా ఉంటాడు. పొరుగింటి వారితో చాలా బాగా మాట్లాడుతాడు. అవసరతలో ఉన్న వారిని తన స్తోమతకు తగినట్లుగా సహాయం చేస్తాడు. సామ్‌సన్ మంచి ఉద్యోగము కలవాడు. కుటుంబానికి సరిపడ ఆదాయము సమకూర్చుకొను సమర్థత ఉన్నవాడు. జాన్సన్‌కు మంచి ఉద్యోగము లేకున్నా ప్రైవేట్ సంస్థలో పనిజేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. సామ్‌సన్, జాన్సన్‌లు ఉంటున్న కాలనీలోనే ఒక పేద కుటుంబం ఉంది. కుటుంబ యజమాని రోజూ కూలి పని చేసుకొంటూ, భార్య ఇద్దరు పిల్లలను పోషిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ప్రతిదినం పని దొరికితేనే గాని పూట గడవని పరిస్థితి అతనిది. "కరువులో వాంతి ఐనట్లు"గా కుటుంబ యజమానికి జబ్బు చేసింది. మామూలుగా వచ్చిన జ్వరాన్ని మందులు వాడకుండా నిర్లక్ష్యం చేసినందుకు విషజ్వరము (టైఫాయిడ్)గా ఆవరించి మంచాన పడ్డాడు.

ఈ సంగతిని తెలుసుకొన్న సామ్సన్ జ్వరపిడితుడి ఇంటికి వచ్చాడు. "నీవు ఆరోగ్యము విషయంలో నిర్లక్ష్యం వహించావు. సమయానికి మందులు తీసుకొని ఆరోగ్యం కాపాడుకోవాలి గదా" అని పరామర్శించాడు. నీవేమి భయపడకు. యేసు నాథుడు పరమ వైద్యుడు. నీ రోగాన్ని బాగు పరుస్తాడు" అని ఓదార్చి ప్రార్థన చేసి ఇంటికి వచ్చేసాడు. విషయం తెలుసుకొన్న జాన్సన్ బ్రెడ్డు, పాలు వెంట తీసుకొని జ్వరపీడితుడి ఇంటికి వెళ్ళాడు. పరామర్శించాడు. తలపై చేయి ఉంచి ప్రార్థన చేసాడు. అనంతరం తనకు తెలిసిన Rmp డాక్టర్‌కు ఫోన్ చేసాడు. ట్రీట్‌మెంటు చేయించాడు. భార్య పిల్లలకు ధైర్యం చెప్పి, ఖర్చుల నిమిత్తం కొంత డబ్బును ఇచ్చాడు. ఆ కుటుంబాన్ని క్రియా రూపంగా సహాయపడ్డాడు.

సోదరా! సోదరీ...! పొరుగువాడు కష్టాల్లో ఉంటే మనం ఎలా స్పందించాలి. సాంసన్ వలెనా? జాన్సన్ వలెనా? దేవుడు 'వాక్కు' ద్వారా ఇలా సెలవిచ్చు చున్నాడు. "వాక్యము కేవలం వినుటయేనని ఆత్మ వంచన చేసికొనకుడు. దానిని ఆచరించాలి". వాక్యానుసారము జీవించుము (యాకోబు 2,22).

సెయింట్ మథర్ తెరిస్సా గారు ఇలా చెప్పారు. "ప్రార్థించే పెదవుల కన్నా సహాయం చేసే చేతులు మిన్నా". యేసు నాథుడు మనకు బోధించిన ప్రకారం మన పొరుగు వారికి సహాయపడాలి, ప్రేమించాలి. అప్పుడే ఆ దేవ దేవుడు మనకు చాలా దగ్గర అవుతాడు, ఆదరిస్తాడు. అన్ని వేళలలా కాపాడుతాడు. ఆయన కరుణ కటాక్షములు మనకు లభిస్తాయి. "ప్రభూ! ప్రభూ! అని సంబోధించు ప్రతివాడును పరలోక రాజ్యములో ప్రవేశింపడు. కాని పరలోకమందలి నా తండ్రి చిత్తానుసారముగా వర్తించువాడే పరలోక రాజ్యమున ప్రవేశించును" (మత్తయి 7,21)

**పి. రాజేంద్ర మోహన్**
**కాగజ్‌నగర్**

## శుభవచనం బైబిల్ క్విజ్‌లో పాల్గొనే వారందరికి శుభవార్త


2022 బైబిల్ క్విజ్ సిరీస్‌ను మనం పూర్తి చేసుకున్నాము. ఇక ఫిబ్రవరి నెల నుండి క్రొత్త సిరీస్‌ను ప్రారంభిస్తున్నాము.

1. ప్రతి నెల అన్ని సరియైన జవాబులు వ్రాసి పంపిన వారి నుండి నెల చివరిలో లాటరీ తీసి దానిలో విజేతలకు బహుమతులు ఇవ్వబడుతాయి.


2. ప్రతి నెల క్రమం తప్పకుండా అన్ని సరియైన జవాబులు వ్రాసి పంపిన వారి పేరు మరియు మార్కులు వ్రాసి ఉంచుతాము. ఇలా అన్ని నెలలు క్రమం తప్పకుండా అన్ని సరియైన జవాబులు వ్రాసి పంపిన వారి నుండి సంవత్సరం చివరిలో లాటరీ తీసి దానిలో విజేతలకు బహుమతులు ఇవ్వబడుతాయి. మొదటి బహుమతి రూ॥ 10,000/-లు, రెండవ బహుమతి రూ॥ 8,000/-లు, మూడవ బహుమతి రూ. 6,000/- సంవత్సరములోని అన్ని పరీక్షలలో పాల్గొన్నవారికి ప్రోత్సహక బహుమతులు ఇవ్వబడుతాయి.

**మీరు ఈ గొప్ప అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరుతున్నాము.**

# బైబిల్ దృశ్యమాలిక


వాళ్ళను ఓడించగలమను కుంటా!
వారు నరమాంస భక్షకులు!
నాశనమౌతాం!
భయపడకండి. దేవుడు మనకు తోడై వున్నాడు.
అంతులేని ఈ యాత్ర ఇక మానుకొని ఈజిప్టుకు వెళ్దాం పదండి.
ఏం చేస్తాం ఈజిప్టుకు వెళ్లక?
!?
ఏంటీ? మళ్లీ దాస్యంలో కేనా? స్వాతంత్ర్యం పోగొట్టుకోడానికా?
పనికిరాని చెత్త తింటూ ఎడారిలో సంచరించడం స్వతంత్రమా? ఎవడికి కావాలయ్యా ఇది.
ఈజిప్టులో మన జీవనం ఎంతో మేలు కదా? కనీసం కడుపునిండా కూడుండేది.
ఇది దౌర్జన్యకరం. దేవున్ని ధిక్కరిస్తున్నావు.
ప్రజలను తిరిగి ఈజిప్టుకు నువ్వు నడిపించలేకపోతే ఇంకెవరినన్నా ఎన్నుకుంటాం.


ప్రజలంతా ఏకమై "మోషే"కు ఎదురు తిరిగారు. కడకు ఆరోను, మిరియాం కూడా వ్యతిరేకించారు.
ఆరోను, నువ్వు నాయకుడుగా ఉండు.
"మోషే" చేసింది మోసం. మన బంగారమంతా నాశనం చేశాడు.
నా వల్ల కాదు కోరా ఆ ఘనత నీదే!.....
!
నిజమైన స్వేచ్ఛ మనకు, వాగ్దత్త భూమిలో మాత్రమే దొరుకుతుంది గుర్తుంచుకో!
?
మమ్మల్ని ఎంత కాలం ఇలా మోసం చేస్తావు?
"మోషే" మిద్యాను మంత్రగత్తె స్వాధీనంలో ఉన్నాడు. ఎడారిలో కూడా ఈమె అతనికి దర్శనాలు కల్పించింది.
కోరా వెనుక వాళ్లందరూ నినాదాలు చేస్తూ ప్రదర్శనలు జరిపారు. భూమి కోరాను మింగివేసింది. మిరియాంకు కుష్టువ్యాధి వచ్చింది.
ఆ మేఘం వైపు చూడు... యెహోవా!!
!!!?
??
ఓ దేవుడా.....!


ప్రభూ! దేవా, ఈ ప్రజలను
క్షమించండి. అజ్ఞానంతో తిరగ
బడుతున్నారు. నీవు దాస్యం నుండి
విడిపించిన నీ స్వంత ప్రజలు వీళ్ల
మీరు తిరగబడినందుకు
శాపగ్రస్తులు. మీ పిల్లలు ఎడారిలో
నలభై యేండ్లు సంచరిస్తారు.
మీరు చేసిన పాపానికి శిక్ష మీరు
అనుభవిస్తారు.

# శుభవచనం బైబిల్ క్విజ్ జవాబులు

## మత్తయి సువార్త 14-28 అధ్యాయాలు

1). ఐదు, రెండు (14,17)

2). భయపడకుడు, ధైర్యము (14,27)

3). గొప్పవాడు, సేవకుడుగా (20,26)

4). మోసగింప (24,4)

5). కొరడాలతో (27,26)

6). సర్వాధికార (28,18)

7). నిత్యజీవములో (25,46)

8). ఎన్నుకొనబడిన వారు (22,14)

9). దేవునకు (22,21)

10). హృదయము (15,19)

11). యేసు (17,2)

12). ప్రార్థనతోను, ఉపవాసముతో (17,21)

13). నా పేరిట (18,5)

14). తృణీకరింపకుడు (18,10)

15). నా యొద్దకు (19,14)

16). మానవ మాత్రుడు (19,6)

17). సజీవుడగు (16,16)

18). ప్రార్థనాలయము (21,13)

19). రక్షణము (24,13)

20). ప్రవక్తలు (24,11)

21). ఆ రోజును (25,13)

22). కీర్తన (26,30)

23). మేలుకొని (26,41)

24). మేఘారూఢుడై (26,64)

25). నూనెను (25,4)

**వచ్చే నెల పాఠ్యాంశం: లూకా సువార్త 1-12 అధ్యాయాలు**

# శుభాకాంక్షలు అందించండి



**జన్మదినం, వివాహము, వివాహ వార్షికోత్సవ, విచారణ పండుగలను పురస్కరించుకొని శుభాకాంక్షలు తెలియజేయాలనుకునేవారికి ఇదొక సదావకాశం. మీరు మీ ఫోటోను, ప్రచురించవలసిన వార్తను పంపించినట్లయితే మేము మీ తరుపున ఈ మాసపత్రికలో శుభాకాంక్షలు ప్రచురిస్తాము.**

బ్లాక్ & వైట్ ఫుల్ పేజీ రూ. 1000/–

బ్లాక్ & వైట్ ఆఫ్ పేజీ రూ. 500/–

బ్లాక్ & వైట్ క్వాటర్ పేజీ రూ. 250/–

ఈ సదావకాశమును వినియోగించుకొని మీ కుటుంబ సభ్యులకు, బంధు మిత్రులకు, శ్రేయోభిలాషులకు శుభాకాంక్షలు తెలియజేయండి.

**వివరాలకు సంప్రదించండి**

9440874028

**రచయితలారా, గమనించండి ! వెంటనే రచనలు పంపండి!**

ఆధ్యాత్మిక స్ఫూర్తినిచ్చే రచనలు, కథానికలు, కవితలు, పిల్లల కథలు, మన విశ్వాసం గురించిన వివిధ అంశాలపై సామాజిక స్ఫూర్తినిచ్చే రచనలు వెంటనే పంపండి. **మీ రచనలు ప్రతినెల 12వ తేదిలోగా చేరాలి.** అలస్యంగా వచ్చే రచనలు పరిశీలింపబడవు.

**వివరాలకు సంప్రదించండి**

9398764408

**ఈ పత్రికను పొందాలనుకునే వారు మీ వివరాలు, అడ్రస్ మాకు పంపించండి**

**వార్షిక చందా 120 రూ॥లు**

**మా అడ్రస్**

**జీవస్వరం**

బిషప్స్ హౌస్, మంచిర్యాల – 504 208

మంచిర్యాల జిల్లా, తెలంగాణ

Cell : 9398764408, e-mail : jeevaswarammagazineadb@gmail.com